"రామ్మూర్తి నన్నింత అన్యాయం చేస్తాడని కల్లోకూడా అనుకోలేదు తెలుసా? అయినా నేను వాడికేం అన్యాయం చేశానని? చదువు చెప్పించిన వాణ్ణి నేను. అదికూడా దిక్కూ మొక్కూ లేకుండా పడుండిన వెధవని, 'తల్లిని, తండ్రిని పొట్టబెట్టుకున్న వెధవ— చేరనీయకు. ఆశ్రమంలో ఎక్కడున్నా పడేసి కావాలంటే నాలుగు డబ్బులు సాయం చెయ్యి' అని అందరూ సలహా ఇచ్చినా వినక తెచ్చినందుకు మంచి శాస్తి చేశాడు నాకు. నే లేకపోతే ఎప్పుడో చచ్చేవాడు. . . రెండు అట్లు రోస్టు చెప్పి కాఫీలుకూడా తీసుకురా, నాయనా. అవతల పనులున్నాయి."

"నేను చెప్పానురా నీకు. అప్పు డేమన్నావు? 'పీడి చెల్లెలు కష్టపడుతుందని అలా చెబుతున్నాడు' అన్నావు. గుర్తుందా? లేదురా, అబ్బీ, వాడు పాముపిల్లరా అన్నాను. అన్నానా లేదా? 'కానీ, నా మేనల్లుడు. నా రక్తం పంచుకున్న దాని కొడుకు' అన్నావు. అన్నావా లేదా?"

"సర్లే. . . బంగారంలాంటి పిల్ల మా సరోజ— దానికేం మత్తెట్టాడో, అదెలా కాదనలేదో మరి— 'సరోజ ఇప్పుడు ఉట్టిమనిషి కాదు, మామయ్యా' అని నవ్వుతాడు—రాస్కెల్!"

"అంత మాటన్నాడ్రా?"

"అంతా ఇంకంతా? గుండెల్తీసిన బంటు కదూ వాడు!"

"వాడు వాడి నాయన పోలికని చెప్పానా, లేదా నేను?"

"వాడి నాయనా? వీడిముందు వాడు ధర్మరాజు. నలుగురం చెయ్యి చేసుకోబోయేసరికి ఒప్పేసుకుని పెళ్లి చేసుకున్నాడు కదూ మా చెల్లెల్ని? వీడొట్టి వెధవ."

"ఆ మాట నే నివ్వరకే చెప్పానా, లేదా?"

"చెప్పావు లేవయ్యా! వాళ్ల నాయనకి చేయబోయిన సన్మానం మర్నాడు ఏర్పాటు చేశావని తెలుసుకున్నాడు— తెల్లవారేసరికి లేడు. తప్పు చేసిందే అనుకో. అయినా పరాయివాడు కాదులే! మేనత్త కొడుకేగా! నా ఇంట్లో పెరిగి, నా అన్నం తిని, నా బట్ట కట్టుకుని, నా కన్నకూతుర్ని అన్యాయం చేస్తాడూ? కంటిక్కనపడితే వాడి అంతు చూడనూ! ఊసి ముఖం చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది."

గాజుగ్లాసు పకుక్కుమన్న శబ్దం వినపడి ఇద్దరూ చుట్టూ చూశారు. వాళ్ల బల్లకి పక్కనా కూర్చున్న అతని చేతినుంచి రక్తం కారుతుండడం చూసి ఖంగారుపడ్డారు. "అదేమిటి, మాస్టారూ, సోడాబుడ్డీలా చేతిలో ఎలా పగిలింది

---

పగ మనిషిని పశువుని చేస్తుంది. పగ పాము బుస లాంటిది. కర్తవ్యం ఆలోచింపజేస్తుంది కాని, స్తిమితం ఉండనివ్వదు. తాగుబోతు కత్తికి తండ్రి బలి అయినాడన్న పగ పసి హృదయంలో గూడు కట్టుకొంది. తండ్రికోసం పగ తీర్చుకోవడం అతని పట్టుదల. అంతటి పగ సెగలు కక్కుతున్నా అతని లోని మానవత్వం ప్రశ్నిస్తూంటే సంభవించేది సంఘర్షణ.

---

గ్లాసు? అయ్యయ్యో! రక్తమండి, బాబూ, కారిపోతూంది. అప్పడం అనుకున్నారేమిటి గ్లాసునలా నొక్కేశారు?"

తెప్పరిల్లాడతను. "అహా! అబ్బే— ఆలోచనలో గ్లాసు నొక్కేశాను. ఫరవా లేదు. నా కిది అలవాటే."

"రక్తం కారిపోతోంది. ఉండండి, హోటల్‌వారి నడిగి మందేమయినా వేద్దాం."

అతను ఖంగారు పడ్డాడు. "అబ్బే, ఎందుకండి? రక్తం అంటే నా కిష్టం. అబ్బే, అదేం లేదులెండి" అని లేచి గబగబ కౌంటరు దగ్గరి కెళ్లి "కాఫీకి— గ్లాసు పగలకొట్టేశాను, ఐ మీన్ గ్లాసుకి మొత్తం తీసుకోండిందులో" అని రూపాయి నోటు పడేసి గబగబ బయటికి వెళ్లిపోయాడు.

'చిత్రంగా ఉన్నాడు సుమా!' అనుకున్నారు వాళ్లు.

* * *

అతను గబగబ అడుగు లేస్తున్నాడు. రక్తం కారుతున్న చేతికి రుమాలు కట్టుకున్నాడు.

మబ్బులు పక్కలా కమ్ముకొస్తూంది పగ పట్టినట్టుగా. అప్పటికి వారం రోజులుగా సూర్యుడి ముఖం చూడలేదు జనం. నేలంతా చితచిత లాడిపోతూంది. "వీడి చేతుల్లో నన్నెట్టుకుంటాట్ట— వీడి తరమా!" అని కోపగించి ఊగిపోతూంది ప్రకృతి. ఈ కోపానికి మేం తట్టుకోలేమని కాళ్లమీద పడి లేస్తున్నాయి కొబ్బరిచెట్లు. ఎప్పుడు విరుచుకు పడిపోతుందో వర్షమన్నట్లు పక్షులు గూళ్లకి చేరుకున్నాయి.

కిచకిచమన్న కలకలం వినపడడంతో తల ఎత్తాడు అతను. కనపడిన దృశ్యం అతన్ని కలవర పెట్టలేకపోయింది. కాకి ఒకటి పిచ్చుకని పట్టేసుకుని ఎగిరిపోతూంది.

'చక్కగా ఇక్కడే కూర్చుని తినక అలా ఎగిరిపోతుందేం' అని విసుక్కున్నాడతను. అంతలో ఎక్కడినుంచి వచ్చి పడ్డాయో పిచ్చుకలు కాకిని తరుమసాగాయి. అన్ని పక్కలనుంచి పొడుస్తున్నాయి. ఇక బాధపడలేక పోయినట్లుంది నోట్లోని పిచ్చుకని వదిలి పారిపోయింది కాకి.

'మనుష్యుల కన్న ఇవే నయం' అనుకున్నాడతను. జేబులోని చెయ్యి కత్తిమీద బిగిసింది. 'మనిషిని మనిషి చంపుతుంటే అడ్డుకునే వాడు లేడు. కావాలంటే ఆ రక్తం తరవాత తమ పిల్లలకి ఉపయోగపడుతుందని సీసాల్లో పట్టుకుంటారుకూడా!'

వేయబోయిన అతని అడుగు గభాలున ఆగిపోయింది. ఎదురుగా బండరాయి.

అదే!

చుట్టూ వేయి తలలతో రోదిస్తున్నట్లు అతని మీద చినుకులు పడ్డాయి. ఎన్నిసార్లు చూశాడు ఆ బండరాయిని! ఈ నాడూ చూస్తున్నాడు. అందులో మార్పు లేదు. దాని చుట్టుపక్కలా మార్పు లేదు. మార్పల్లా అతనిలోనే!

ఆ నాడు అశక్తుడు. చిన్నవాడు. బలం రాని చేతులు. పట్టుదల తప్ప, ప్రతీకారం చేసే శక్తి లేని శరీరం. ఈనాడు? ఈ నాటి తన రూపం వెనక, తన శక్తి వెనక ఎంత తపస్సుంది!

వంగి ఆ బండరాయిమీద నుదురు ఆనేలా తల వంచాడు. ముద్దు పెట్టుకున్నాడు.

"చిన్నా!" పిలుపు వినపడింది.

ఒళ్లు జలదరించింది. చుట్టూ చూశాడు. మార్పు లేదు. ఎవరూ లేరు. రాతిమీద రెండు నీటిచుక్కలు అగపడ్డాయి. తనవా? కళ్లమీద చెయ్యి వేసుకున్నాడు. కన్నీళ్లు ఏనాడో ఇగిరిపోయాయి తన కళ్లలో. మరెవరివి?

"చిన్నా, నే న్నాన్నా!"

భ్రాంతిలో పడిపోతున్నాడు అతను. రాతికి పక్కనే చతికిలపడ్డాడు.

"చిన్నా, పారిపో!" పెద్ద అరుపు. శక్తినంతటినీ కూడగట్టుకుని అరిచిన అరు పది. మమతనంతా పోసుపేసి అరిచిన అరు పది.

రాతిమీద తల ఆన్చాడు. 'నాన్నా, వెడుతున్నా నాన్నా— నీ పనిమీదే వెడుతున్నాను' అనుకున్నాడు.

ఆ దృశ్యం అతని కళ్లముందు మెదిలింది.

"మీరు ఒంటరిగా వెళ్లద్దు. నా మాట వినండి. అన్నిటా మీ కీ మొండి పట్టు పనికిరాదు. వాడు పరమ మూర్ఖుడు."

నవ్వేశారు నాన్న. "పోవే! ఇలా ప్రతి మనిషి బెదిరింపులకి చస్తే మనిషి చాలా చావులు చావాలి! పదరా, చిన్నా!"

"వాడి వలన ఉపయోగం ఏమిటి? వెంట మన గోపాలాన్నయినా తీసుకెళ్లండి. నా మాట వినండి."

నాన్న కెప్పుడూ అదే అలవాటు. తను నమ్మిన మార్గం తప్ప ఆయన కేదీ అగపడదు. అంగుళం అటు ఇటు కదల్చలే రెవరూ?

అందుకే ఊరంతా ఒక్కటిగా నిలబడి ఒక్క మాట మాట్లాడలేకపోయినా ధైర్యంగా వెళ్లాడు సాక్ష్యం ఇచ్చేందుకు. అమ్మతో పాటు అయినవాళ్లంతా బ్రతిమాలారు.

"మన కెందుకు మహారాజా— కందకు లేని దురద! ఆయనకి అయిన వాళ్లు బోలెడు మందున్నారు ఊళ్లో. వాళ్లకి లేని 'న్యాయం' మీ కెందుకు? మన బతుకు మనం బతక్క—ఏమయినా జట్టీలంటండి?" అంది అమ్మ.

"అది కాదు, బావా, సాక్షికం ఇచ్చావే పో! అవతల ప్లీడరు గుడ్డిగా వాదించాడంటే బుజువు సరిగా లేదు కనక కొట్టేశాం అన్నా అనగలరు. అయినా మన కెందుకీ బెడద? పోయినవా డెటూ పోయాడు. ఇప్పుడు కావాలన్నా రాడుగంద! పాము నెత్తిని పుల్లతో కొట్టడం లాంటిది నువ్విప్పుడు సాక్షికం ఇవ్వడం. ఏమంటారు, చెల్లెమ్మగారూ" అన్నాడు నాయుడమ్మ.

"ఆవిడ చెప్పే హరికథ వినిపించేసిందిగా! అయినా ఒరేయ్, బావా! ఇదేమన్నా ఊరా అడవిరా— తెలియక అడుగుతాను? మనిషిని మనిషే నిలువునా చంపేస్తుంటే 'అదేమిటని' అప్పు డడిగిన వా రుండకపోతే పోయిరి. గవర్నమెంటొచ్చి 'చంపిన వాడిని చూపించండి. జైల్లో పెడతాం. కోర్టు కీడ్చి శిక్షిస్తాం' అని అంటూంటే ఒక్కడు— ఒక్కడంటే ఒక్కడు మాటాడకపోతే అదేం న్యాయంరా? తప్పొరేయ్, జీవితం శాశ్వతం కాదురా, నాయనా. న్యాయానికి నిలబడాలి. ఎవడూ చెప్పక న్యాయం జరగడం లేదు, కోర్టులు పడయి పోతున్నాయని ఏడుస్తే ఎలాగు?" అన్నారు నాన్న.

"అవతలివాడు కటిక మూర్ఖుడు.

# పగ



-సింగరాజు రామచంద్రమూర్తి

మనం పిల్లలు గల వాళ్లం. అది ఆలోచించు మరి."

నవ్వేశారు నాన్న. "పిల్లలు లేకపోతే చావచ్చునంటావు! నేను చెప్పేదే ఖాయం."

పంచాయతీ పెట్టారు. పెళ్లి కుండ బద్దలు కొట్టినట్లు తెగేసి చెప్పాడు.

"ఊరంతా చూస్తుండగానే చంపేశాడు నాగులుగాడు. వాడు ఫకీరుకి కుడిభుజం. ఫకీరేం చేయమన్నా వాడది చేసేస్తాడు. ఫకీరంటే ఆడుగో వాడు" అని చూపించే సరికి ఇన్‌స్పెక్టరే ఉలిక్కిపడ్డట్టు తరవాత చెప్పుకున్నారు ఊళ్లో.

"రాఘవరావు మంచి వాడనుకున్నాను ఇన్నాళ్ళు. హరిశ్చంద్రుడయిపోయాడే! సత్యం చెప్పి హరిశ్చంద్రుడేటయి పోయాడో ఎరగడేటి ఈడు? ఇన్‌స్పెక్టర్ గారికే నన్ను సూసేసరికి గుండాగి పోయింది. నాగులుగాణ్ణి పట్టుకు పోయాడు" అని ఫెళ్ళున నవ్వి, "రాఘవ రావు వీలునామా రాసేసినాడేమో కను

క్కోండి. ప్లీడర్నెటూ పెడుతున్నానుగా వాగులుగాడి కోసం? ఈయనకి పీలు వామా ఊరికే రాయించి పెడదారి! పుణ్యం ఎక్కడికి పోద్దిలే! ఏమంటావురా, మావాఁ?" అన్నాడట ఫకీరు గుడి దగ్గర ఎవరితోనో ఆదే రోజు.

"రాజకీయాలు మన కెందుకోయ్, రాఘవరావూ? ఆ ఫకీరుకి, వెంకట్రామయ్యకి ఉన్న పోట్లాటలు ఈ నాటివి కావు. వెంకట్రామయ్య డబ్బున్నవాడు. ఫకీరుగాడి కదే లేదు. అందుకే ఆయవంటే మంట. ఊళ్లో అందరూ వీడి నోటికి, చేతికి భయపడతారు. నేను వెంకట్రామయ్య కదే చెప్పాను— 'ఏదో వాడికి కొంచెం విదిపితే పోలేదుటయ్యా కుక్కలాయి బ్రతుకుతాడు నీ దగ్గర' అని. అది లేకపోగా వాడిటువంటి వాడటువంటి వాడని పోలీసులకి రిపోర్టులుకూడా ఎందుకట?" అని ఆటూ ఇటూ చూసి "నాగుల్ని ముందుకు నెట్టాడు గాని వెంకట్రామయ్యని పొడిచింది ఫకీరుగాడే. తెలుసా?" అనడిగాడు మునసబు.

"మరి ఊరుకుంటావేమయ్యా? భలేవాడివిలే— ఒక్కడికి ఇంతమంది ఝడిసిపోవడమా? ఊరంతా కలిస్తే వాడెంత, వాడి ప్రాణం ఎంత? నా వెనక ఉండు, పోనీ" అన్నారు నాన్న మునసబుతో.

"నీ వెనక నీ నీడకూడా ఉండదు. మంచిగా సాక్షికం మార్చేసుకో. పోలీసులు అలా చెప్పించారని" అని చెప్పి వెళ్ళిపోయాడు మునసబు.

తరవాత తెలిసింది మునసబుని ఫకీరు వంపాడని.

భయపడినా దేన్ని గురించి భయపడి నట్లుండకూడదన్నది నాన్న సిద్ధాంతం. అందుకనే ఆ రోజు అంత బీభత్సం ఊళ్లో జరిగినా సాయంత్రం నాటకానికి బయలుదేరారు— "రారా, చిన్నా. పోదాం" అని తన్ని వెంటేసుకుని.

ఈ నాటికీ తనకి జ్ఞాపకం— వీథిలో వాళ్లంతా నాన్న వంక వింతగా చూడడం!

"ఏం నాయుడమ్మా, నాటకానికి వస్తావుట్రా?" అనడిగారు నేరుగా, ఆయనింటిముందు నిలబడి.

"ఏమిటయ్యోయ్, మరీ జల్సాగా ఉంది నీ పని! ఫకీరుగాడు ఏమంటున్నాడో వినలేదా?"

"ఏమంటున్నాడేమిటి?"

" 'రాఘవయ్యతో లావాదేవీ లున్న వాళ్లంతా చూసుకోండెవ్! ఆడికిక శేరుకు మించి బియ్యం లేవీ ఖూమ్మోద!' అంటున్నాట్ట. తెలుసా?"

నవ్వారు నాన్న. "అంత మొనగాడేమిటి, బావా, వాడు? వాడింట్లో పాము ఆగుపడితే చంపిందెవడో అడక్కపోయావ్? అప్పు డేముందో ఈ ధైర్యం! నన్నాపోడ్ని మీ రంతా కలిసి పిరుడ్ని చేశారులే! అందరూ వాడికి భయపడటమేనాయె! ఎందుకో ఎవ్వడూ ఆలోచించుకోడు. నా విషయం తెలియదనుకుంటా! బాణాకర్ర నా చేతిలో ఉన్నంతసేపూ నా మీద చిన్న రాయేస్తే ఆది ఇసకయి పోవలసిందే! నీ కెందుకు భయం, బావా, నే నున్నాగా" అన్నారు నాన్న.

"నాకు భయమేమిటి— భలేవాడివే! ఎటూ వెడదామనే గదా అనుకుంది. నిన్ను రావద్దంటున్నాను కాని! పద్యాల నాటకం కదూ, ఊళ్లోంచి సానామంది బయల్దేరుతున్నారులే!"

బస్తీలో నాటకం అయినాక బ్రతిమలాడాడు నాయుడమ్మ—"ఫకీరు లేపేస్తా

ఇదుగో! నోటికంతా రక్షణ చేకూర్చే
టూత్ పేస్ట్ —నీమ్
నీమ్ టూత్ పేస్ట్ మీ పళ్ళను శుభ్రపరచడమే గాదు, నీమ్ టూత్ పేస్ట్‌లో ఆరోగ్య ప్రదాయిని వేప (నీమ్)కు వుండే అద్భుత లక్షణాలన్నీ వున్నాయి. పళ్ళను గట్టిపరిచి చిగుళ్ళకు రక్షణ చేకూర్చి, దుర్వాసనను నివారించి, మీ నోటిని సర్వదా స్వచ్ఛంగా వుంచుతుంది.




కలకత్తా కెమికల్‌వారి ఉత్పత్తి

వన్నాడుట. వద్దు, బావా, చీకట్లో వెళ్లకు. ఇక్కడే పడుకుందా'' మని.

''నేను చెప్పేది తప్పు కాదు. తప్పు చేసిన వాడిని 'నీది తప్పు' అని పబ్లికున చెప్పినవాడిని. భగవంతుడు లేడా! న్యాయం వాడు చూడడా! పదరా, చిన్నా!'' అంటూ బయలుదేరారు నాన్న.

ఏవేవో పనులు చెప్పుకుని వెంటొచ్చిన వారిలో కొందరు దిగబడిపోయారు తెల్లారాక వస్తామంటూ.

తలకి తుండు గట్టిగా కట్టుకుని బాణాకర్ర పట్టుకుని ఒక చేత్తో తన చేయి పట్టుకుని బయలుదేరారు నాన్న నాయుడమ్మ చెప్పిన మాటలు తనకి భయం కలిగించినా అంతెత్తున నాన్న, చేతిలో బాణాకర్రతో నడుస్తుంటే దేముడు నడుస్తున్నట్టుగా అనిపించింది తనకి. పక్కన నాయుడమ్మతో సహా మరో ముగ్గురు.

చలి— కురుస్తున్న మంచు వలన కింద కాళ్ళు రేగడి మట్టిమీద జీరు తున్నాయి. కాని, తన కవేమీ తెలియడం లే దప్పుడు. 'నాన్నతో త్వరగా ఇంటికి చేరితే బాగుండును' అన్నదే తన ధ్యాస.

నాన్నే మధ్య మధ్య నాటకం గురించి మాట్లాడుతున్నారు గాని, మిగిలిన ముగ్గురూ పలుకు లేకుండా నడుస్తున్నారు.

ఊరి పొలిమేర గంగానమ్మ గుడి దాపుకొచ్చారు. ఇహ భయం లేదనిపించింది తనకి.

అంతలోనే నడుస్తున్న వాడల్లా నాన్న ఆగాడు— ''ఎవరది?'' అంటూ.

దిక్కులు ప్రతిధ్వనించినట్లు నాలుగు పక్కలనుంచి మనుష్యులు దగ్గరయారు. మధ్య తనూ, నాన్న మిగిలారు.


''నేనే, రాఘవయ్యా— ఏదో మగాడివి కదా చూద్దారని కాపేశాను ధర్మరాజు గార్ని పైకి పంపుదారని!''

క్షణంలో నాన్న బాణాకర్ర ఎత్తారు. తను వాళ్లకి దూరంగా తప్పుకున్నాడు.

''ధైర్యం ఉంటే ఒక్కడివీ నాతో రారా, ముగ్గురు కావాలా నీకు తోడుగా'' అన్నారు నాన్న.

''ధైర్యమేంటి, రాఘవయ్యా, ఇప్పటి దాకా నీ వెంట ముగ్గురున్నారు. నేనూ ముగ్గుర్ని తెచ్చుకున్నాను. నీ వెంటున్న వాళ్ళ పిరికి సన్నాసులు. నన్ను చూడడ మాలస్యం పారిపోయారు. వెర్రిసన్నాసివి నువ్వు— వాళ్ల న్నమ్ముకున్నావ్! వేయండిరా— వాడితో మన కేటి, అవతల తెల్లారిపోతోంది.''

అంతే. తరవాత అంతా కర్రల శబ్దమే. ఏమవుతూందో లీలగా మాత్రమే తెలిసింది తనకి.




నాన్న ధాటికి వాళ్ళు ఆగలేకపోతున్నారు. అది తనకి ఆనందం కలిగించింది— 'నాన్న దేముడు కనకనే గెలుస్తున్నాడు' అని.

అయితే, అంతలోనే నాన్నకి కాలు జారింది. వెనక్కి తూలి ఈ బండ అడ్డం ఉండడం వలన పడిపోయారు— తల రాయిమీద ఆనేలా.

ఆ క్షణం చాలును వాళ్లకి! రాబందుల్లా, రాక్షసుల్లా మీద పడ్డారంతా!

''చిన్నా, పారిపో!'' మమత తెంచుకోలేని జీవి ఆఖరి ఆక్రందన మది. నరాల్లోంచి, రక్తంలోంచి ప్రేమ పెల్లుబికి ''నువ్వయినా బతుకు, చిన్నా'' అని అరిచిన అర పది.

తను పారిపోయాడు. పొగమంచులో దారి తెలియక గంగానమ్మ గుడి చాటున దాక్కున్నాడు.

''కుర్రవెధవ చూశాడురా— వాడిని పట్టుకోండి'' అంటున్నాడు ఫకీరు.

''నాయుడమ్మా వాళ్లూకూడా మన్ని చూశారు'' అన్నా రెవరో.

''వాడికి గుండె లుండక్కర్లే చెప్పేందుకు? రేపే రాఘవయ్యకి పట్టిన గతి చూస్తాడుగా. కుర్రవెధవని వెతకండెహె!''

అంతా వెతికారు. అదృష్టం తనని కాపాడింది.

చీకట్లో ఎలా ఇల్లు చేరాడో తనకే తెలియదు. ఇంటిముందు ఒక్క అరుపరిచి పడిపోయాడు తను. కళ్లు తెరిచే సరికి చుట్టూ అందరూ తన్ని ఆత్రతతో చూస్తున్నారు.

''కళ్లు తెరిచాడు. స్టేటుమెంటు రాసుకుందురుగాని — రండి'' అంటున్నా రెవరో.

''నాయనా, చిన్నా, ఏం జరిగింది?'' తను వారిని అడిగింది ఒకే ప్రశ్న— ''నాన్న బాగున్నారా?'' అని.

ఒకరి ముఖాలు ఒకరు చూశారు. అందులో ఒకాయన — ''లేదు, పోయారు. మీ నాన్నని చంపేశారు. నువ్వు చూశావు గదూ— ఎవరు పొడిచారో చెప్పు'' అన్నాడు.

తన కా దృశ్యం మనసులో కదిలింది, ఒక్కణ్ణి చేసి కత్తులతో నాన్నని పొడవడం — ''చిన్నా, పారిపో!''

ఎందుకు పొమ్మన్నారు నాన్న? బ్రతికి, పెరిగి పెద్దవాడై తన చావుకి ప్రతీకారం చేయమనా?

''చెప్పు, నాయనా, ఎవరూ చంపింది?''

ఆ వయసులోనే త నొక నిర్ణయానికి వచ్చేశాడు క్షణంలో. నాన్నని చంపిన వాళ్లని చూసినది తనూ, మిగిలిన ముగ్గురూ. అందులోని వారెవరూసాక్ష్యం చెప్పరు. నాయుడమ్మ అసలు రాడు. నాన్ననికూడా సాక్ష్యం ఇవ్వద్దని బ్రతిమాలినవా డతను. తను కుర్రాడు. నమ్మేదెవరు తన మాటని? అథవా కొంత వరకు నమ్మినా, వాళ్లకి పడే శిక్ష కొంచెం మాత్రమే ఉంటుంది.

''చిన్నా, పారిపో!'' పారిపోయాడు తను. నాన్న చావుకి ప్రతీకారం తీర్చుకోవాలి. న్యాయాన్ని తన చేతుల్లోకి తీసుకోవాలి. తనే నాన్న ఆత్మకి శాంతి చేకూర్చవలసినవాడు.

''చెప్పు, చిన్నా, నాన్నగారిని చంపిన దెవరు? ఇనస్పెక్టర్‌గారు అడుగుతున్నారు. నీ మీద ఆధారపడి ఉంది, చిన్నా!''

''చిన్నా, పారిపో! నీ మీద ఆధారపడి ఉంది.'' నాన్న ఉద్దేశ్యంకూడా అదే కావచ్చును.

అంతే. తన నోటినుంచి ఒక్క మాట రాలేదు— ''చూడలేదు, పొగమంచు'' అన్నవి తప్పించి.

''గుర్తు తెచ్చుకో, చిన్నా, నాన్నగారిని చంపిన వాళ్లని జైలుకి పంపాలని నీకు లేదురా?'' అమ్మ అడిగింది దీనంగా.

జైలుక్కాదు, పైకి పంపాలని ఉంది. కాని, ఇది కాదు సమయం. త నిప్పుడు ఆ మాట పైకి అంటే తననే పంపిస్తారు ఆ రాక్షసులు.

''నీ కేం భయం లేదురా. ఎవ్వెవరూ ఏమీ చేయకుండా మేం చూస్తాము'' అన్నాడు పెద్దన్నయ్య రంగ.

మాట్లాడలేదు తను.

''పిరికి వెధవలాగున్నావే— నేను చూస్తే ఈ పాటికి పోలీసుస్టేషన్‌కి నేనే వెళ్లి ఉండేవాడిని'' అన్నాడు రెండవ అన్న గౌరి.

''నాకు తెలియదు. నేను చూడలేదు. నా కప్పుడు భయం వేసింది'' అన్నాడు తను.

''చూడు, చిన్నా, ఆ రౌడీలు ఏమన్నా చేస్తారని భయమా? నాన్నగారికన్నా ఎక్కువా మన కివన్నీను! నువ్వంటే నాన్న కెంత ప్రేమరా!''

భోరున ఏడ్చేశాడు తను. నాన్నకి బాణాకర్ర ఒక చేతిలో, రెండవ చేతిలో తన చేయి ఎప్పుడూ ఉండాలి. బాణాకర్ర అన్యాయం చేసింది చేజారిపోయి. తను చేయడు.

''అసలు ఈ ఊరు నుంచి పెద్దక్కయ్య దగ్గరికి హైదరాబాదు వెళ్లిపోదాం మనం. నీ కేం భయం లేదు. పోలీసులకి చెప్పు ఎవరెవరో. రేపు ఉదయం మనం వెళ్లిపోదాం'' అంది అమ్మ.

తన నిర్ణయం మారలేదు.

కోపం వచ్చి అందరూ తనని తిట్టడం మొదలెట్టారు. ''కుక్కని వెంటేసుకుని వెళ్లినా బాగుండేది నాన్న'' అన్నాడు రంగ.

''వేలెడు లేడు వెధవ—వీడి కెంత తీపి ప్రాణంమీద!'' అన్నాడు గౌరి.

అమ్మ ఏడిచింది— ''నా ఖర్మ'' అనుకుని. తరవాత నాయుడమ్మకి కబురెట్టింది.

అతను రాలేదు. తనే వాళ్లింటికి వెళ్లింది అమ్మ. ''ఏమన్నయ్యా! నీ కిది తగునా? కళ్లతో చూస్తివి. ఆ మాట చెబితే వాళ్ల పని వాళ్లు చేస్తారు గదా! ఆయన ధర్మానికి నిలబడలేదూ?'' అంది.

''అవునమ్మా నిలబడ్డాడు. నేను, నువ్వు వద్దంటున్నా నిలబడ్డాడు. ఏమయిపోయాడు— మర్నాటి మార్యుణ్ణి చూడ లేదు మళ్లా. చెల్లెమ్మా! తెలియనిది కాదు నీ కీ ఊరు సంగతి. అసలు వ్యక్తిని

కాళ్ళ పట్టేసుకున్నాడు ఫకీరు— "రక్షించు, చిన్నయ్యా, ప్రాణం పెట్టు వాకు. ఏం చేయమన్నా చేస్తాను. పోలీసు లకి లొంగిపోతా కావాలంటే" అన్నాడు.

లాగి తన్నాడు కాలితో. వెల్లకిలా పడ్డాడు ఫకీరు. "వీడికి—ఈ పిరికి వెధవకా మీ రంతా ఇన్నాళ్ళ భయపడింది? అసలు ఊళ్ళో మగాళ్ళున్నారా? అందరూ కలిస్తే వీడెంత, వీడి బ్రతుకెంత? కుక్క ... ఒరేయ్, కుక్కా, లే" అని చొక్కా పుచ్చుకుని నిలబెట్టాడు.

గుడ్డపీలికలా వేళ్లాడుతున్నాడు ఫకీరు.

"మా నాన్నని దొంగచాటుగా చంపావు. నే నలా చేయను. అందరి ఎదుటా కొట్టాను నిన్ను. ఇప్పుడు అంద రెదుటే చంపుతా న్నిన్ను. ధర్మయుద్ధం నాది. నీ లాగా దొమ్మీగా మనుష్యుల్ని తీసుకురాలేదు. నేను, నువ్వు— అంతే. కత్తి తెచ్చాను. కాని, వాడలేదు; వాడను. చేతులతోనే చంపేస్తాను" అని పెద్దగా నవ్వి, "ఇంకేముంది, అయ్యే పోయింది నీ పని. ఒక్కటే దెబ్బ చాలు మెడమీద! అది ఇక్కడ కాదు. పద నీ ఇంటికి. నీ పెళ్లాం, పిల్లల్ని చూసుకో—పద" అని ఈడ్చుకుంటూ బయలుదేరాడు.

ఊరు ఊరు కదిలింది వెంట.

"తలుపు కొట్టు" అని, తలుపు తెరిచాక లోపలికి ఈడ్చుకు వెళ్లాడు.

దృశ్యాన్ని చూసిన ఫకీరు భార్య చిన్న కాళ్ళ చుట్టేసింది — "రక్షించండి, బాబూ" అంటూ.

"వాడు చెడు చేస్తుంటే చెప్పని దానివి ఇప్పుడే ముఖంతో మాట్లాడు తున్నావు? చూడు— ఊరంతా ఎలా నిలబడి చూస్తున్నారో! ఒక్కరూ ముందుకు రారు. ఎందుకు? ఇన్నాళ్ళా నీ మొగుణ్ణి గౌరవించిన వాళ్ళ లేరు. అందరూ వాడికి భయపడిన వాళ్ళే. ఫకీరుగాడిమీద చేయి చేసుకున్నవాడు వాళ్లకి సాక్షాత్తు దేముడే!

ఇప్పుడు వీణ్ణి చంపుతున్నాను. నా తండ్రిని వీడు చంపాడు. నేను వీడిని చంపేస్తాను" అని చేయెత్తాడు.

ఫకీరు కళ్ళ మూసేసుకున్నాడు.


"నాన్నా!" అన్న అరుపు వినబడింది.

'చిన్నా!' అనే తండ్రి పిలుపు వినబడిం దతనికి అందులో.

"ఎవ రది?" అన్నాడు ఫకీరుని వదిలి.

"నా కొడుకు, బాబయ్యా" అంది ఆశగా ఫకీరు భార్య.

"ఏడీ, ఇటు రమ్మను. న్యాయం తప్పను. మా నాన్నని చంపిన వాడిమీద నేను పగ తీర్చుకుంటున్నాను. వీడి కొడుక్కి కూడా ఆ అవకాశ మివ్వాలి. వాడి తండ్రి చేసినది తప్పన్న విషయం గ్రహిస్తాడు, తెలివిగలవా డయితే. వీడి లాంటి మూరుడే




అయితే వీడికి పట్టిన గతే పట్టిస్తాను అప్పుడు వాడికికూడా. అవకాశ మివ్వడం ధర్మం. పిలువు వాడిని" అన్నాడు చిన్న.

"రాలేడు, బాబూ, ఆ మంచంలో పడుకున్నాడు."

ఫకీర్ని బొమ్మలా ఈడ్చుకుంటూ మంచం దగ్గరికి తీసుకువెళ్లాడు చిన్న. "ఇడుగోరా నీ తండ్రి— మహా పాపి. వాడిని చంపేస్తున్నాను. నన్ను చూడు. బాగా చూడు. లేచి చూడు."

వాడు లేవలేదు.

"నీకూ పొగరేనా?" అని ఎడం చేత్తో వాడి చొక్కా పట్టుకుని లేపాడు. అతను వదలగానే వాడు గుడ్డపీలికలాగా వేళ్లాడి వెనక్కి పడిపోయాడు.

"ఏమిట్రా అలా పడ్డావు?" అని అడిగాడు చిన్న.

"వాడికి కాళ్ళు లేవు, బాబయ్యా! కాళ్ళు, చేతులు, నడుము—అన్నీ పడి పోయాయి" అంది ఫకీరు భార్య.

తెల్లబోయాడు చిన్న. ఫకీరుమీద అతని పట్టు సడలిపోయింది. "ఎందు వలన?"

కళ్లనీళ్లొట్టుకుంది ఫకీరు భార్య. "వాడికి జబ్బు, బాబూ! ఈడు చేసిన పాపాలకి వాడు అఘోరిస్తున్నాడు" అని ఏడ్చేసింది.

తల తిరిగిపోయింది చిన్నకి. వాడి చేయి పుచ్చుకుని ఎత్తాడు. వదలగానే దూదిలాగా కింద పడిపోయింది.

గిరుక్కున వెనక్కి తిరిగాడు. "వీ డొక్కడేనా నీకు సంతానం?"

"అవును, బాబుగారూ. సంపాదించిన దాంట్లో తాగ్గా మిగిలింది నాకూ, నా కొడుక్కీ విదుపుతాడండి, బాబయ్యా. తాగుడు మానేసి వాడికి మందిప్పించ మంటే వినడండి. మళ్లీ అడంటే వళ్లుమారిన ప్రేమండి. 'చిన్నాడా చిన్నాడా' అంటూ వదలడండి మందుమీద లేనప్పుడు."

ఇక వినలేకపోయాడు. జేబులో చేయి పెట్టాడు. ఎందుకయినా ఉంటుందని తెచ్చుకున్న డబ్బు తీసి ఆవిడ చేతిలో పోశాడు. తన చేతి కున్న వాచీ ఊడదీసి ఇచ్చేశాడు. "అదికూడా అమ్మి పిల్లాణ్ణి డాక్టరుకి చూపించుకో" అని ఫకీరు వంక తిరిగి, "నీ కొడుకు నిన్ను రక్షిం చాడురా వెధవా— వాడిని దేముడిలాగా చూసుకో" అని గబగబ బయటికి నడిచాడు.

అచేతనుడై కదిలే ఓపిక లేక అలాగే పడున్నాడు ఫకీరు.

వాడి భార్య మాత్రం చేతులు జోడిం చింది, అతను వెళ్లిన దిక్కువైపు. *